క్లుప్తంగా

వైద్య శిబిరానికి స్పందన



గ్రామస్తులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్‌లో శనివారం భాస్కరా హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామంలోని కట్టమైసమ్మ దేవాలయం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తులకు కంటి, దంత, ఎముకల వైద్య పరీక్షలు నిర్వహించారు. జనరల్ చెకప్‌తో పాటు బీపీ, షుగర్ పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా 150 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి వైద్యులు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ క్రాంతి, గ్రామ పెద్దలు, వైద్యులు, ప్రజలు పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ



భక్తులకు మంగళసూత్రాన్ని చూపిస్తున్న వేదపండితుడు

మొయినాబాద్‌రూరల్: గోవింద నామస్మరణతో కనకమామిడి వేంకటేశ్వరస్వామి దేవాలయం మార్మోగింది. శనివారం మండల పరిధిలోని కనకమామిడి వేంకటేశ్వస్వామి దేవాలయంలో శ్రావణమాసం చివరి శనివారంతో పాటు పోలాల అమావాస్య సందర్భంగా స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ కొండా లక్ష్మీకాంత్‌రెడ్డి, వేదపండితులు, ఆలయ అర్చకుల మంత్రోచ్ఛరణల మధ్య సురంగల్ తాజా మాజీ సర్పంచ్ గడ్డం లావణ్యఅంజిరెడ్డి దంపతులు కూర్చొని ఈ ఉత్సవాన్ని జరిపించారు. అనంతరం స్వామివారికి నూతన వస్త్రాలు, పండ్లు, తలంబ్రాలు, పూలమాలలు సమర్పించారు. విచ్చేసిన భక్తులకు స్వామివారి దర్శనంతో పాటు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి

కేశంపేట: స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం పలువురు నాయకులతో కలిసి చాయ్‌పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓట్లు వేసి మోసపోయారన్నారు. స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలు పార్టీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పసుల నర్సింహ యాదవ్, మండల కన్వీనర్ కంచుకోట మహేశ్, మండల ప్రధాన కార్యదర్శి కల్వకోలు తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

హనుమాన్ దేవాలయంలో పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో హోమం, గోపూజ నిర్వహించారు. అనంతరం స్వామివారి పల్లకీసేవ నిర్వహించగా.. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పట్టణానికి చెందిన కారుకొండ లత, శివకుమార్ దంపతులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు శ్రీశైలం గౌడ్, యంసాని నర్సింలు, నారాయణ, కృష్ణయ్య, శంకరయ్య, బచ్చన్న, కృష్ణయ్య, ప్రవీణ్, యాదగిరి, పద్మావెంకటేశ్, గోరియా నాయక్, కొత్త సత్తయ్య, శ్రీనివాస్, రమేశ్, రవి, హన్మంత్‌రెడ్డి, రవీందర్, నర్సింలు, సింగపాగ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కొత్తూరు: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తిమ్మాపూర్ 11కేవీ ఫీడర్ పరిధిలో లైన్ షిఫ్టింగ్ పనులు చేపడుతున్న కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రమేశ్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తిమ్మాపూర్, తిమ్మాపూర్ చౌరస్తా కాలనీలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. రైతులు, ప్రజలు, వ్యాపారులు ట్రాన్స్‌కోకు సహకరించాలని కోరారు.

నాణ్యమైన విద్యే లక్ష్యం



కొందుర్గులో ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే సర్కారు లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల కేంద్రంలో ఇదివరకు సీఎం రేవంత్‌రెడ్డి భూమిపూజ చేసిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తేవడానికే ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు ఏర్పాటు చేస్తుందన్నారు. ఇందులో భాగంగా కొందుర్గులో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి రూ.200 కోట్లు మంజూరు చేసిందని స్పష్టం చేశారు. ఒక ఏడాది సమయంలో భవన నిర్మాణ పనులు పూర్తవుతాయని, ఈ పాఠశాలలో 5 నుంచి 12వ తరగతి వరకు అందరు విద్యార్థులను చేర్చుకొని విద్యాబోధన చేస్తారన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు హాస్టల్ వసతి ఉంటుందని, అదేవిధంగా ఉపాధ్యాయులు ఇక్కడే ఉండేందుకు వసతులు కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులు పూర్తిగా ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఉంటారన్నారు.

రైతులు దరఖాస్తు చేసుకున్న వారంలో కరెంటు కనెక్షన్..

ఇదివరకే రైతులు కరెంట్ కనెక్షన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదన, ఇక నుంచి ఆ పరిస్థితి లేదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొందుర్గు సబ్‌స్టేషన్‌లో నిల్వ ఉంచిన కరెంట్ సామగ్రిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లో కరెంటు కనెక్షన్ ఇస్తారన్నారు. మండలంలో అవసరం మేరకు విద్యుత్ సామాగ్రి అందుబాటులో ఉంచామని స్పష్టం చేశారు. అన్ని గ్రామాల్లో లూజ్‌లైన్లు లేకుండా సరిచేయిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్‌కుమార్, ఎంపీడీఓ లక్ష్మీఅనురాధ, ఎంఈఓ గాయత్రీదేవి, ట్రాన్స్‌కో డీఈ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఏడీ సత్యనారాయణ, ఏఈ రవికుమార్, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే ధ్యేయం

షాద్‌నగర్: మహిళా అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ మైనార్టీ మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా అల్ప సంఖ్యాక వర్గాల ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, రఘునాయక్, బాల్‌రాజ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, ఇబ్రహీం, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మండపాలకు అనుమతులు తప్పనిసరి



కొత్తూరు: ఉత్సవాలపై చర్చిస్తున్న సీఐ, మున్సిపల్ కమిషనర్

సీఐ నర్సింహారావు

కొత్తూరు: ప్రతీ మండపానికి నిర్వాహకులు తప్పకుండా అన్ని శాఖల అనుమతి తీసుకోవాలని సీఐ నర్సింహారావు సూచించారు. శనివారం కొత్తూరు మున్సిపల్, పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. యువజన సంఘాలు, ప్రజలు ఇతరులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా వినాయక ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఇతరులకు ఇబ్బందులు ఏర్పడే విధంగా డీజేలు, సౌండ్‌బాక్సులు అర్ధరాత్రి వరకు పెట్టొద్దని సూచించారు. నిమజ్జనం సమయంలో ముందుగానే ఊరేగింపు రూట్లను సరిచూసుకొని విద్యుత్‌శాఖ సిబ్బందితో చర్చించాలని నిర్వాహకులకు తెలిపారు. చెరువులు, కుంటల వద్ద నిమజ్జన సమయంలో పెద్దలు తమ పిల్లలకు సాయంగా ఉండాలని కోరారు. ఉత్సవాల నిర్వహణలో యువజన సంఘాలు, ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, ఆయా శాఖల అధికారులు, పీస్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

నందిగామ: యువజన సంఘాలు, ప్రజలు ఇతరులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా వినాయక ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ అన్నారు. మండల కేంద్రమైన నందిగామలో శనివారం పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మండపాలను వేసుకోవాలని, డీజేలను ఉపయోగించొద్దని సూచించారు. అదేవిధంగా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వినాయకుడి నిమజ్జనంకు సంబంధించి పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుమతి, పలు గ్రామాలకు చెందిన యువజన సంఘాల సభ్యులు, పలు పార్టీల ప్రతినిధులు, యువకులు, మండల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. మహాదానం

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్: రక్తదానం మహాదానం అని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. విశ్వబంధుత్వ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని విజయ్‌నగర్ కాలనీలో ఉన్న బ్రహ్మకుమారీస్ సమాజ సేవా విభాగం ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకుగాను ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి రక్తదానం చేయాలని కోరారు. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. అనంతరం ఆయన రక్తదానం చేసిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ చైర్మన్ మదన్‌మోహన్ రెడ్డి, బెజుగం రమేశ్, నంద కిషోర్, నందీశ్వర్, యారం శేఖర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మురళీ, అశోక్, రమేశ్, రాంచందర్, శ్రీపాల్‌రెడ్డి, సంతోష్, సందీప్, శోభ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వద్దు

డీఆర్డీఓ శ్రీలత

షాద్‌నగర్‌రూరల్: మొక్కల పంపకంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని డీఆర్డీఓ శ్రీలత హెచ్చరించారు. శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమం వాడివేడిగా సాగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డీఆర్డీఓ హాజరై కార్యదర్శులు, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఉపాధి హామీపై సమీక్ష నిర్వహించారు. అధికారుల పనితీరుపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వనమహోత్సవంలో భాగంగా నాటిన ప్రతీ మొక్కను బతికించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నాటిన మొక్కలను తొలగించినా, చెట్లను నరికివేసినా వెంటనే వారికి నోటీసులు ఇవ్వాలని సూచించారు. 400 మొక్కలు నాటే చోట 45 మొక్కలను నాటడం.. అందులో 21 మొక్కలు మాత్రమే బతకడమేమిటనీ వారి పనితీరుపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మొక్కలను సంరక్షించేందుకు ట్రీ గార్డియన్(వాచ్‌బాయ్)ను నియమించుకోవాలని సూచించారు. విద్యుత్ తీగలకు అడ్డుగా వస్తున్నాయని స్తంభాల కింద పెరిగిన చెట్లను ట్రాన్స్‌కో అధికారులు ఇష్టానుసారంగా నరికి వేస్తున్నారన్నారు. సంబంధిత అధికారులు అందుబాటులో ఉండి ఎంతమేర కొమ్మలు తీసివేయాలో సూచించాలన్నారు. ఉపాధి అధికారులు ఇష్టానుసారంగా జాబ్‌కార్డులు ఉన్నవారికే మళ్లీ ఇస్తున్నారని, క్యాష్‌బుక్‌లను అప్‌డేట్ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కూలీల డబ్బులను సకాలంలో చెల్లించకుండా ఎందుకు అలసత్వం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఉపాధి కూలీలకు చెల్లించే ప్రతి పేమెంట్‌కు తప్పనిసరిగా బిల్లులు ఉండాలని, నర్సరీ స్థలం, సీడ్‌కు సంబంధించిన రికార్డులు మీ దగ్గర ఉండాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌డీఓ అడిషనల్ పీడీ సుభాషిని, ఏపీఓ కొండయ్య, చేవెళ్ల క్లస్టర్ ఏపీడీ చరణ్‌గౌతం, విచారణ అధికారులు సునీత, మూర్తి, సునీత, ఎంపీడీఓ బన్సీలాల్, ఎంపీఓ జయంత్‌రెడ్డి, ఏపీఓ అరుణ రాణి, నర్సయ్య, పంచాయితీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శ్రీలత

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

షాద్‌నగర్: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని గంట్లవెల్లిలో శనివారం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యువతకు విద్య ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొని రాణించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, రంగయ్యగౌడ్, వీరేశం గుప్తా, వెంకట్‌రెడ్డి, బీశ్వరామకృష్ణ, పల్లె శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్, నగరం శ్రీనివాస్, నర్సింహ, కిరణ్ కుమార్‌గౌడ్, ఫారూఖ్, ఆంజనేయులు, సిద్ధు, అంబదాస్, రాఘవేందర్, శివకుమార్, భరత్, కావలి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో రవీందర్‌యాదవ్, నాయకులు

భక్తిశ్రద్ధలతో శ్రీసత్యసాయి శత వార్షికోత్సవం

చేవెళ్ల: సత్యసాయిబాబా చూపించిన మార్గాలు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయని చేవెళ్ల సత్యసాయిబాబా సేవాసమితి సభ్యులు అన్నారు. శనివారం మండలంలోని కౌకుంట్లలో ఆ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీసత్యసాయిబాబా శత వార్షికోత్సవంలో భాగంగా బాలవికాస్ సత్యసాయి గ్రామోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ, పారిశుద్ధ్య సిబ్బందికి వస్త్రాలు పంపిణీ చేశారు. గ్రామంలోని భజన బృందాన్ని, పాఠశాల సిబ్బందిని సన్మానించారు. విద్యార్థులకు చిత్రలేఖనం, పరుగు పందెలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు, భజనలు, చిత్రపటంతో పల్లకీసేవ ఊరేగించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. సత్యసాయి సేవా సమితి సేవా కార్యక్రమాలను వారు అభినందించారు.

కాలుష్యం నుంచి ప్రజలను కాపాడాలి

కాంగ్రెస్ పార్టీ నాయకుడు స్వామి

షాబాద్: పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం నుంచి ప్రజలను, రైతులను కాపాడాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి కోరారు. శనివారం నగరంలోని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ సెక్రటరీ రవిని కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని చందనవెల్లి గ్రామ సమీపంలో కుందన్ టెక్స్‌టైక్స్ ప్రైవేట్ పరిశ్రమ నుంచి మధ్యరాత్రి పూట పొగ కాలుష్యంతో వెలువడడంతో గ్రామంలో చిన్నపిల్లలు, వయోవృద్ధులు శ్వాస సంబంధిత రోగాలకు గురవుతున్నారని తెలిపారు. దుర్వాసన వెదజల్లడంతో చుట్టు పక్కన గ్రామాల రైతులు పొలం పనులు చేయలేక పోతున్నారని వివరించారు. పరిశ్రమపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు వేమారెడ్డి, రాఘవాచారి, శ్రీశైలం, మల్లేశ్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి, రాంచందర్, శ్రీహరి, శ్రీనివాస్, నిరంజన్‌కుమార్, వెంకటేశ్, అంజయ్య తదితరులు ఉన్నారు.

ఘనంగా లక్ష్మీనర్సింహాస్వామి ఉత్సవాలు

కేశంపేట: మండల పరిధిలోని సంతాపూర్ గ్రామ శివారులో ఉన్న శ్రీశ్రీశ్రీ లక్ష్మీనర్సింహాస్వామి ఉత్సవాలు రెండో రోజు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు మండల పరిధిలోని ప్రజలతో పాటు కడ్తాల్, తలకొండపల్లి మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం నిర్వహించిన జాతరలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి వేర్వేరుగా పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. దేవాలయ ప్రాంగణంలో సత్యనారాయణస్వామి వ్రతాలు జరిపించారు.

ఫొటోగ్రాఫర్ల సంఘం మండల కమిటీ ఎన్నిక

చేవెళ్ల: ఫొటోగ్రాఫర్ల జీవనోపాధిని కాపాడుకునేందుకు అంతా ఐక్యంగా కలిసి ఉండాలని మండల ఫొటోగ్రాఫర్ల సంఘం సభ్యులు అన్నారు. మండల కేంద్రంలో శనివారం మండలంలోని ఫొటోగ్రాఫర్ల సమావేశం నిర్వహించి.. నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా కిషన్, ఉపాధ్యక్షుడిగా వై. శ్రీనివాస్, కార్యదర్శిగా బి.మల్లేశ్, జాయింట్ సెక్రటరీగా వెంకటేశ్, కోశాధికారిగా జనార్దన్, సలహాదారులు సునీల్, అశోక్‌ను ఎంపిక చేశారు. అనంతరం నూతన సభ్యులకు పీఏసీఎస్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అనంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం మాజీ సభ్యులు తదితరులు ఉన్నారు.

పనులు చేయకుండానే బిల్లులు!



జిల్లేడ్ చౌదరిగూడ సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు, ఉపాధి సిబ్బంది

- కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లపై పనితీరుపై అసహనం
- డీఆర్డీఓ శ్రీలత

కొందుర్గు: ఉపాధిహామీ పథకంలో పనులు చేయకుండానే బిల్లులు చేయడంలో అంతర్యమేమిటని డీఆర్డీఓ శ్రీలత ప్రశ్నించారు. శనివారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద ఉపాధిహామీ పనులకు సంబంధించి 2024–25 సంవత్సరంలో వివిధ గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ మండల ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌పీ కాశన్న ఆధ్వర్యంలో డీఆర్పీలు వివిధ గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులు, పనుల్లో జరిగిన అవకతవకలను చదివి వినిపించారు. మండలంలోని 24 గ్రామాల్లో 338 పనులకుగాను ఖర్చు చేసిన మొత్తాన్ని వివరించారు. అయితే మస్టర్లో కూలీల సంతకాలు లేకపోవడం, పలు భవనాల నిర్మాణం పూర్తయిన ప్లాస్టరింగ్ చేయకపోయినప్పటికీ బిల్లులు ఇవ్వడం వంటి అవకతవకలు జరిగినట్లు డీఆర్పీలు వెల్లడించారు. ఈ సందర్భంగా డీఆర్డీఓ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లపై అసహనం వ్యక్తం చేశారు.

బిల్లులు ఇవ్వడంపై ఆగ్రహం

ఎదిర, వనంపల్లి గ్రామాల్లో పనులు చేయకుండానే బిల్లులు ఇవ్వడంపై డీఆర్డీఓ శ్రీలత ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాండురంగం, రాములు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఆంజనేయులు, టీఏ వినోద్‌కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాటిన మొక్కలకు వారానికి నాలుగు రోజులే నీళ్లు పోయాల్సి ఉండగా.. ఆరురోజులు పోసినట్లు బిల్లులు చెల్లించడం ఏమిటనీ, అదీ నవంబర్, డిసెంబర్ మాసాల్లో నీళ్లు పోయడం ఏమిటని ప్రశ్నించారు. సదరు డబ్బులు రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీఓ సుభాషిణి, సునిత, ఏపీడీ శరణ్‌గౌతమ్, ఎంపీఓ హన్మంత్‌రెడ్డి, ఏపీఓ నర్సింగ్ రావు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

టీపీయూఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు సురధీర్

చేవెళ్ల: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానాన్ని తొలగించి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని టీపీయూఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు గణపురం సురధీర్ అన్నారు. మండలంలోని కమ్మెట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో ఉపాధ్యాయులందరూ శనివారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు.. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సీపీఎస్ విధానం రద్దు చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ విధానం 2004 సెప్టెంబర్ 1 నుంచి ఉమ్మడి రాష్ట్రంలో అమలులోకి వచ్చిందని, రాష్ట్రం ఏర్పడ్డాక కేంద్రం అడిగిన ప్రశ్నకు గత ప్రభుత్వం సీపీఎస్ విధానంలోనే ఉంటామని చెప్పినందుకు నిరసనగా ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మోర లక్ష్మణ్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాశేఖర్ రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, రమణారెడ్డి, మోహన్, దయాకర్‌రెడ్డి, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.



చేవెళ్లలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన

శంకర్‌పల్లి: రాష్ట్రంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం శంకర్‌పల్లి అధ్యక్ష, కార్యదర్శులు జంగయ్య, శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం శంకర్‌పల్లిలోని పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్‌కి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు వెంకటేశ్, భాగ్యలక్ష్మి, సంధ్య, రాజేందర్, బస్వరాజ్, హరిశంకర్, కృష్ణయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చర్యలు



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న ఏడీఏ రమాదేవి, అధికారులు

ఏడీఏ రమాదేవి

షాద్‌నగర్‌రూరల్: రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని ఏడీఏ రమాదేవి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు శనివారం ఫరూఖ్‌నగర్ మండలానికి 18 మెట్రిక్ టన్నుల(432 బస్తాలు) యూరియా వచ్చింది. పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో వ్యవసాయ అధికారులు రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రతిరోజు యూరియా పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నిషాంత్‌కుమార్, విస్తరణ అధికారులు తేజ్‌కుమార్, రాంబాబు, పీఏసీఎస్ సీఈఓ రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలు అభివృద్ధి సాధించాలి

బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ

షాబాద్: బీసీలు సామాజికంగా, ఆర్థికంగా, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అభివృద్ధి సాధించాలని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. శనివారం మండల పరిధిలోని తాళ్లపల్లిలో బీసీసేన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం బీసీసేన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీసీసేన గ్రామ అధ్యక్షుడిగా వడ్ల మాధవచారి, ఉపాధ్యక్షుడిగా పసుల గోపాల్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా చాకలి అంజయ్య, యువజన కమిటీ అధ్యక్షుడిగా తమ్మలి నరేశ్, ఉపాధ్యక్షుడిగా సుమన్‌చారిని నియమించి నియామకపత్రాలు అందజేశారు. బీసీలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బీసీబిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో బీసీలంతా పోటీకి సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బీసీసేన జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వ సుధాకర్, మండల అధ్యక్షుడు కమ్మరి దయాకర్‌చారి, ఉపాధ్యక్షుడు మీరంపల్లి బాల్‌రాజ్, యూత్ అధ్యక్షుడు బండ అజయ్ కుమార్, నాయకులు తదితరులు ఉన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డికి నివాళి

చేవెళ్ల: సీపీఐ జాతీయ నాయకుడు, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి అన్నారు. మండల కేంద్రంలో శనివారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభులింగం, వడ్ల సత్యనారాయణ, డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్, మండల నాయకులు తదితరులు ఉన్నారు.

పార్టీకి తీరని లోటు

మొయినాబాద్: కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మరణం సీపీఐ పార్టీకి తీరని లోటని మండల కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. సుధాకర్‌రెడ్డి మృతిపై శనివారం మున్సిపల్ కేంద్రంలో సీపీఐ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సుభాన్‌గౌడ్, నాయకులు తదితరులు ఉన్నారు.



చేవెళ్లలో నివాళులర్పిస్తున్న నాయకులు